# ఆనందమే అందం

(కథల సంపుటి)




పొత్తూరి విజయలక్ష్మి

# ఆనందమే అందం

కథల సంపుటి

పొత్తూరి విజయలక్ష్మి

శ్రీ రిషిక పబ్లికేషన్స్
హైదరాబాదు

# Aanandame Andam

A collection of short stories

By **Pothuri Vijayalakshmi**

© P. Vijayalakshmi

*First Edition* : 2010

*Price* : Rs. **120/-** **$ 10**

*For Copies* :
All leading Book Shops

*Book Production* :
**T. Muralidhar Gowd**
**9393 176 552**

*Cover Design* :
**K.V. Bhima Rao**

*Layout* :
**K.B.T. Kondaiah**

*Published by* :
**Sri Rishika Publications**
Flat No. 201; Vikasini Apartments
2-2-1121/3 & 3A, New Nallakunta,
Hyderabad - 500 044
Email : pvlakshmi8@gmail.com
Ph : 040-27637729

*Printed at :*
**Karshak Art Printers**
Vidyanagar, Hyderabad - 500 044
Ph : 040-2761 8261, 2765 3348

# జీవన మకరందం

**పొ**త్తూరి విజయలక్ష్మి. ఈమె కథలు వ్రాయును. పొత్తూరి వారనగా నియోగులు. కరణములు. వీరికి తెలివి తేటలుండును. చమత్కారము, మాటగడుసరితనము వీరి సొత్తు. చదివినవారికి ఈమె కథలలో క్వాచిత్‌గా హాస్యము స్ఫురించును. కొందరు నవ్వుదురు. కొందరు నవ్వరు. కారణమేమి? ఇది వారి వారి మనో వైచిత్రిపై నాధారపడి యుండును. మనో వైచిత్రి రెండు విధములు. సంకల్పిత వైచిత్రి. అసంకల్పిత మనోవైచిత్రి. అప్రయత్నముగానే కొందరికి పెదవులు విడవడి నవ్వు వుద్భవించును. ఇదియొక చమత్కారము.

నాకు తెలిసి అమ్ముల రామనాథమని యొకడున్నాడు. ఆచంట అగ్రహారీకుడు. ముక్త్యాలరాజా, వాని పూర్వీకులకు భూవసతిని ఏర్పాటు చేసినాడు. ఎందుకు చేసినాడో వానికే తెలియదు. ఇక మనకేమి తెలియును? కనుక తెలియదు. అతడు చారిత్రక కథలు యిబ్బడిముబ్బడిగా వ్రాయును. వాటిలో హాస్యము జొప్పించుట యాతనికి బరిపాటి. కాని బాఠకులకు మాత్రము నవ్వురాదు. ఇది మన బ్రారబ్ధము. ఆతని దోషము లేదు. జీవుడి వేదన పుష్కలముగా యుండును. మొక్కలు నాటెదము. ఎరువు వేయుదుము. నీరు పోయుదుము. కొన్ని కాయును, కొన్ని కాయవు. ఎందువలన? భగవదేచ్ఛ యనగా నిదియే! భగవంతుని నమ్మనివారుందురు. వారు హేతువాదులు. తెనాలి హేతువాదులకు బ్రసిద్ధి. ఒక ప్రాంతములోనే పుట్టగొడుగులవలె వీరెందుకు బుట్టెదరు? ఆ నేల యొక్క లక్షణమట్లు అఘోరించినది. కనుక సుక్షేత్రమున నవరత్నముల బోలిన నవధాన్యములు బండును. ఊసర క్షేత్రములలో తొండలు గుడ్లుపెట్టును... విశ్వనాథ సత్యనారాయణ యీ పీఠిక రాయడం మొదలుపెడితే ఇలా నడుస్తుందని వూహించాను.

"... మరిన్ని వివరాలు అందించడానికి మా ప్రతినిధి లైన్లో వున్నారు. ఓ వర్టు రమణ. రమణా ఆనందమె అందం పుస్తకం గురించి మీ దగ్గరున్న తాజా సమాచారం ఏంటి?''

. . .

“ఆc కావ్యా, పొత్తూరి విజయలక్ష్మి ఈ పుస్తకం రాయడం జరిగింది కావ్యా. అంతే కాకుండా యిందులో ఇరవై కథలున్నాయి కావ్యా. ఆc కావ్యా, అయితే ఇది ఆమె హాండ్‌రైటింగులో కాకుండా అచ్చులో వుంది కావ్యా. అట్లాగే మరి దీనికి కవర్‌పేజీ కూడా వుండడం జరిగింది కావ్యా.

“రమణా, దీన్ని గురించి పాఠకులు ఏమనుకుంటున్నారు? వారి స్పందన ఏమిటి?”

“ఆc కావ్యా, ఇంకా ఈ బుక్ రీడర్స్ దాకా వెళ్లడం జరగలేదు కావ్యా. అయితే పుస్తకాన్ని చూసిన వాళ్లు బావుందని చెప్పడం జరిగింది కావ్యా. దీన్ని కొని చదువుతారా లేదా అనే విషయాన్ని కాలమే నిర్ణయించడం జరుగుతుందని కొందరు క్రిటిక్స్ అంటున్నారు కావ్యా!”

“థాంక్యూ రమణా – ఓవర్ టు స్టూడియో.”

ఇది ఓ ఛానెల్ అందించిన ఫోన్ ఇన్ బైట్ అనుకుని, ఇక అసలు సంగతికి వస్తే–

శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మి దాదాపు పాతికేళ్ల పైబడి కథలు రాస్తున్నారు. నవలలు నవలికలు రాశారు. అయితే ఒక విడత వివిధ పత్రికలలో అచ్చయిన వాటన్నిటినీ గుచ్చెత్తి, సంపుటాలు చేద్దామని వుబలాట పడలేదు. ముప్పై ఏళ్లు వచ్చేదాకా రచనలు చేయగలనని ఆమెకు తెలియదు. తెలిశాక మరింక బద్ధకించలేదు. ఈ మధ్యనే రెండు కథాసంపుటాలను వెలువరించారు. ఇది ముత్యం మూడోది.

భమిడిపాటి కామేశ్వరరావు ఒక అభిమానికి రాసిన ఉత్తరంలో చదివాను: నీ రచన పత్రికలో అచ్చయాక పక్కనపెట్టు. పన్నెండేళ్ల తర్వాత మళ్లీ చదువు. అప్పటికీ అచ్చేయ తగినదేనని భావిస్తే పుస్తకంగా తీసుకురండి... అని రాశారు.

విజయలక్ష్మి పాతికేళ్లు పక్కన పెట్టారు కాబట్టి, కాలానికి నిలిచినట్టే. లాబ్స్‌లో క్లినికల్ టెస్ట్ లాగా సాహిత్యానికి కూడా అవసరం. చెప్పేవాళ్లు చెబుతారు. వాళ్లసోమ్మేంపోయె. “నీ కథలన్నీ శుబ్బరంగా ఓచోట చదవాలనుందోయ్” అని ఊరిస్తారు, కవ్విస్తారు. వేద్దాం వేద్దాం అనే వాళ్లేగాని ఖర్చంతా మనమే అచ్చుకోవాలి. సలహా ఇచ్చి పురికొల్పిన వాళ్లు ఫ్రీవాయనం పుచ్చుకొని చక్కా వెళ్తారు.

ఈ సంపుటి టైటిల్ స్టోరీ “ఆనందమే అందం” మనసుకి హత్తుకునే మంచి కథ. ప్రేమాభిమానాలు, దయాపేక్షలు లాంటి మాటలు నిఘంటువులకే పరిమితమై పోతున్న కాలంలో మనం జీవిస్తున్నాం. “సగటు ఇల్లాలి స్వగతం” ముమ్మూర్తులా

పేరుకి తగినట్టుగా వుంది. "ప్రత్యేకదినం" – ఇటీవల కాలంలో పెచ్చుపెరిగిన దినాలమీద సరసమైన విసురు. ఈ కారు మీదేనా అంటే, ఆహా! షాపింగ్‌కి వెళ్లేప్పుడు మా ఆవిడది, సినిమాకి వెళ్లేటప్పుడు మా అబ్బాయిది, పెట్రోలు బంక్‌కి వెళ్లేటప్పుడు మాత్రం నాది – అన్నాట్ట ఒక తండ్రి. మాతృ పితృ గురు దినోత్సవాలు, డాక్టర్ లాయర్ టైలర్ దినోత్సవాలు అసలు ఎన్ని దినాలంటే ప్రతిరోజూ ఏదో ఒక దినం వుంటుంది. దీని వెనక పెట్టుబడిదారీ వ్యవస్థ తాలూకు కుట్ర వుందని కొందరు భారతీయ నాగరికతను దెబ్బతీసే ప్రయత్నమని కొందరు వాపోతూవుంటారు.

మద్రాసులో ఒక పెద్దాయన "పిట్స్‌మన్" పుట్టిన రోజు ఏటా ఘనంగా చేసేవాడు. షార్ట్‌హాండ్ లిపిని కనిపెట్టి, కోట్లాదిమందికి ఉపాధి కల్పించిన పిట్స్‌మన్ స్మరణీయుడని ఆయన ఫోటోకి దండవేసి దణ్ణం పెట్టేవాడు. అది చాలా గొప్ప కార్యక్రమంగా అన్పిస్తుంది.

"కొత్త కథ" సినిమా కథ మీద కూర్చోవడం, "మా ఆవిడకి పతి దొరికాడు" పేరుతో గాలంవేసి పాఠకుల్ని పట్టుకునే ట్రిక్కు. "తమాషాగారడీ" అందరూ చేసేదే, అందరికీ తెలిసిందే. గొప్ప కళేమీ కాదని బోలెడు ఉదాహరణలు యిచ్చారు. విజయలక్ష్మి కథలు చదివితే మనమూ రాసెయ్యచ్చు, పెద్ద కష్టమేం కాదనిపిస్తుంది. అలా అనిపించడంలోనే రచనా శిల్పం వుంది. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిని యీ తేటతెలుగు ఎలా వచ్చిందండీ అని అడిగితే, అమ్మలక్కల కబుర్లు విని నేర్చుకున్నానని చెప్పేవారట. ఇక మరి యీవిడే అమ్మలక్క అయినప్పుడు చెప్పేదేముంది.

కొందరు చిన్నకార్డుముక్క రాసినా నాలుగుసార్లు చదువుకోవాలనిపిస్తుంది. అవి నేను థర్డుఫారం చదువుతున్న రోజులు. క్లాసుటీచర్ రాసిన కార్డు ఇంటికి వస్తే, అందరి సమక్షంలో నన్నే చదవమన్నారు మా పితాశ్రీ. చదివాను. "అయ్యా, మీ కుమార్డు (రోల్ నెం. 19) లెక్కలంటే లెక్కలేకుండా వుంటున్నాడు. మీరు శ్రద్ధ వహించకపోతే తోకలేని తొమ్మిదులు, తలలేని అర్లు వచ్చే అవకాశం వుంది. గ్రహించగలరు". గుండె ఆగినంత పనైంది. 'సున్నా' అనకుండా ఎంత పాజిటివ్ కోణంలో చెప్పారో కదా మా మాస్టారని ఇప్పటికీ గుర్తొస్తూ వుంటుంది.

ఈ సంపుటిలో "పచ్చడన్నం" లాంటి నవనాగరికత, "పెళ్లిచూపులు" లాంటి కామెడీ ఆఫ్ ఎర్రర్సూ వున్నాయి. పెళ్లిచూపులు కథలో ఒకానొక స్టేషన్‌లో సస్పెన్స్ విడిపోవడం, రెండు మూడు చోట్ల యీ కథ యిక్కడ ఆపెయ్యచ్చు కదా అనిపించడం సహజమే. అయినా రచయిత్రి రాతలో చదివించేగుణం వుంది కాబట్టి ఆగకుండా

చివరంటా వెళ్లిపోతాం. నాలుగైదు స్కెచ్‌లు ఈ కథల్లో కలిసి పోయాయి. దానివల్ల ప్రమాదం లేదు. అదేమీ కల్తీ కాదు.

1960 దశకంలో వార మాస పత్రికల్లో లబ్జుగా వుండే రొమాంటిక్ స్టోరీలు విరివిగా వచ్చేవి. రాధమ్మబాకీ, ఎర్రతేలు, ముఖేష్‌పాట, వంటొచ్చిన మగాడు యిలాంటివి. మళ్లీ మళ్లీ చదివి ఆనందించేవారు పాఠకులు. కారణం ఏమైతేనేంగాని క్రమేపీ యువతరంలో అమాయకత్వం నశించింది. మునుపటిలా రాధకోసం బెంగపెట్టుకోడం మానేశారు.

స్పృహ చాలదు, సామాజిక స్పృహ వుండాలనే వాదం మొదలైంది. తెలిసీతెలియని అయోమయం పోయి గడుసుతనం ఆవరించింది. భ్రమ లేని జీవితం వూటలేని మాగాయి పచ్చడిలా వుంటుంది. చివరకు అదే అయింది. కథలో పాత్రలు ఏపిల్‌పండుని, క్రీమ్ బిస్కెట్‌నీ తిన్నట్టు రాస్తే – ఔట్! అందులో సామాజిక స్పృహ లేనట్టే. రైటర్ బూర్జువా!!!

ఫ్రాన్స్‌లో వైన్ టేస్టర్లు వుంటారట. వాళ్లకి పురిషెడు వైన్ రుచి చూపిస్తే, అవి ఏ ప్రాంతపు ద్రాక్షలతో ఎన్నేళ్ల క్రితం పుటం పెట్టారో చెప్పేస్తారు. అలాగే బ్రాడ్వే నాటకాల జాతకాన్ని అయిదారుగురు క్రిటిక్స్ తేల్చేస్తారు.

మన కలాలకి కూడా బోలెడు ఆంక్షలు వచ్చేశాయి. పిల్లదయ్యాల కథలు, మంచి దయ్యాల ఉపకారాలు, అద్భుత దీపాలు కనుమరుగైనాయి. చాలామంది మంచి రచయితలు సందేహంలో పడిపోయి, ఆలోచనల్ని బలవంతంగా దిశ మార్చుకుని రాయడం మొదలు పెట్టారు. దాంతో చిత్తశుద్ధి లోపించిన రచనలు సాగాయి. సగటు పాఠకుడు ఆసక్తి కోల్పోయాడు.

మేధావి వర్గాల విధి విధానాలను పెడ చెవిన పెట్టి, తన ధోరణిలో తను రాసుకుంటూ వెళ్లారు విజయలక్ష్మి. హాస్యకథల మీద రెడ్ అలర్ట్ వుండగా యిన్ని కథలు రాయడం దుస్సాహసమే!

తోచినప్పుడు, తోచనప్పుడు, రైలు ప్రయాణంలో, నిరీక్షణలో చదువుకుని ఈ కథల్ని ఆస్వాదించవచ్చు. పెద్దగా మెసేజ్‌లు వున్నాయని చెప్పను (దానికి ఎస్ ఎమ్మెస్ చాలు కదా). మారుతున్న అభిరుచులమీద, వేస్తున్న వెర్రితలలమీద కావల్సినన్ని చురక లున్నాయి. తెలుగు నుడికారాలు, కనుమరుగైన మానవ సంబంధాలు, ఆత్మీయతలు పొత్తూరి విజయక్ష్మి కథల్లో పుష్కలంగా కనిపిస్తాయి. రుచులెరిగిన వారికి కమ్మని భోజనం “ఆనందమే అందం”.

ఏ కథ చదివినా – కొత్త పెళ్లికూతురు పూలు కడుతున్నట్టు, పోకిరీపిల్ల గవ్వలు చిలకరించినట్టు, తొలకరిజల్లులో తడిసిన పాలపిట్ట రెక్కలు విదిల్చినట్టు అనిపిస్తుంది. శ్రీమతి విజయలక్ష్మి యిలాగే సున్నితమైన హాస్యంతో కథలు రాస్తే, చదవాలని ఉవ్విళ్లూరే అనేకానేకమంది పాఠకుల్లో నేను మొదటిబంతిలో వుంటాను. అందుకు తగినట్టుగా వారి లోగిలి సదా సుఖశాంతులతో వుండాలని మనసా కాంక్షిస్తున్నాను.

హైదరాబాద్ ***శ్రీరమణ***

20-10-2009

# నవ్వటం నా జన్మహక్కు

**నా**కు బాగా చిన్నతనం. వాకిట్లోకి కూరలూ, పళ్ళూ అమ్మకానికి వచ్చినప్పుడు మా అమ్మ నన్నూ అన్నయ్యనీ పిలిచి అక్కడకూర్చోబెట్టి అప్పుడా అమ్మే మనిషిని పిలిచి బేరం ఆడేది. ఇంతకంటే దమ్మిడీ ఎక్కువ ఇవ్వను ఇస్తే ఇవ్వు లేకపోతే పో అనేది. ఆ అమ్మాయి వెళ్ళిపోతుంటే మమ్మల్ని ఉసికొల్పేది. మేమిద్దరం ఏడుపు మొదలుపెట్టేవాళ్ళం. ఏం చేస్తాను, పిల్లలేడుస్తున్నారు రా అని వెనక్కి పిలిచేది, లౌక్యంగా!

మా అమ్మమ్మకి వంటపొయ్యి నీళ్ళబావీ తప్పించి ఇంకేమీ తెలీవు. కానీ అన్నీ తెలుసని అనుకునేది. నా పెళ్ళి కుదిరాక మంచినీళ్ళ బావిదగ్గర అందర్నీ పోగేసి మా మనవరాలికి పెళ్ళికుదిరింది మా మనవడే. మా ఆడపడుచు కూతురికొడుకు. అతనూ ఇంజరే మా అల్లుడిలాగా. అదేదే ఊళ్ళో రైలింజనులు తయారు చేస్తాడుట. ఆ ఊరేమో కలకత్తా అవతలట. గుంటూరు, ఢిల్లీ, బొంబాయీ, చెన్నపట్నం, బాపట్లా, పొన్నూరూ అన్నీ దాటాక వస్తుందిట ఆ ఊరు... అని చెప్తుంటే అందరూ హాశ్చర్యంగా వినేవాళ్ళు. పెళ్ళయ్యాక మా వారు ఏ శలవుమీదో వచ్చి ఓ పదిరోజులు ఇక్కడ వుండేవారు. నన్ను పక్కకి పిలిచి "అమ్మడూ మరి అబ్బాయి ఇక్కడ వున్నప్పుడు అక్కడ రైలింజన్లు ఎవరు చేస్తారే?" అని అడిగేది.

మా మాతామహులు ఏ ఏడాదికో ఓ సినిమాకి వెళ్ళేవారు. పాండురంగ మాహాత్మ్యం, చెంచులక్ష్మి వంటివి మాత్రమే చూసేవారు. టికెట్టు తెప్పించుకునేవారు ముందుగానే. ఆ టికెట్టుకోసం వెళ్ళే మనిషి చేరబిలిచి, 'ఇదుగో నేను గోవిందరాజు సుబ్బారావుకి దగ్గర బంధువునని చెప్పు ఆ టాకీసు వాళ్ళకి' అని చెప్పి మరీ పంపించేవారు. సినీమా చూసొచ్చి 'నేను ఫలానా అని తెలిసి మంచి చోటు ఎంచి మరీ కుర్చోబెట్టాడు. సినీమా ఆద్యంతం చక్కగా కనిపించింది' అనుకుని ఆనందపడేవారు. అందరూ పోన్లే అలాగే అనుకోనీ, ఆరోగ్యకరమైన భ్రమకూడా మంచిదే అనుకునేవాళ్ళు.

ఒకసారి మాత్రం తనంతట తనే వెళ్ళి వెంటనే వెనక్కొచ్చేశారు. అదేమిటీ అంటే నేను ఫలానా అని తెలియజేసినా గుర్తించకపోవటమే కాకుండా హేళనగా నవ్వేడు ధూర్తుడు. వాడి టాకీసులో నేను సినీమా చూడను అన్నారు.

ఇక మా పితామహులు ఆయన గురించి ఎంత చెప్పినా తక్కువే (నా ప్రేమలేఖ నవల్లో పరంధామయ్య పాత్ర ఆయనకి ఎనిమిదో కార్బన్ కాపీ). మాది ఉమ్మడి కుటుంబం. ఒకసారి మా బాబాయికి ఆఫీసునించీ మెమో లెటరు వచ్చింది. ఎవరికి ఏ ఉత్తరం వచ్చినా మా తాతగారే ముందు చదివేవారు. ఆ ఉత్తరం కూడా సావకాశంగా చదివి బాబాయిని పిలిచి 'తలకు చమురు రాసుకోడంకూడా రాని వెధవ్వి. నీకు ఆఫీసునించి మెమో కాక ప్రశంశా పత్రం వస్తుందా' అని ఎద్దేవాచేసి మరీ ఇచ్చారు ఆ ఉత్తరం. మా బాబాయి మొహం ముద్చుకున్నాడు. "ఇంటికి యజమాని ఆయనే. పెత్తనం అంతా ఆయనదే. మేము కాదన్నామా. ఓ చోట కూచోడు ఇల్లంతా అంగలం తిరుగుతారు. అయినా నేనేం చేశాననీ? కట్టుకున్న పెళ్ళాం చేత తలకి నూనె రాయించుకోటం కూడా అపరాధమేనా! మా చెడ్డ చావుగా వుంది ఈయనతో" అని వాపోయాడు.

మా నాన్నగారు మా అమ్మకి ఇష్టంలేని పనేదైనా చేసి ఆవిడ అలిగితే ఆలయాన వెలసిన ఆ దేవునిరీతీ అనే గ్రామఫోన్ రికార్డు పెట్టేసేవారు. అమ్మకి ఇంకా కోపం వచ్చేది. చాల్లెండి. చేసే తలతిక్కపనులు చాలక పాటలుకూడానూ. మిమ్మల్ని చూసి పిల్లలూ భ్రష్టుపట్టిపోతున్నారు. నిన్న స్కూల్నించీ రాగానే ప్రోగ్రెస్ కార్డు చూపించకుండా చదువురాని వాడిననీ దిగులు చెందకూ అనే రికార్డు పెట్టారు" అని విరుచుకు పడేది.

మా శ్రీవారు నాకు వేలువిడిచిన మేనత్తకొడుకు. పెళ్ళి నిశ్చయం అయ్యాక అంతా బానే వుంది కానీ అక్కయ్యా, చిన్నపిల్ల, దూరభారం ఎలా సమర్థించుకుంటుందో అన్నారుట మా నాన్నగారు మా అత్తగారితో. మావాడు సికిందరాబాదు ట్రాన్స్ఫర్కోసం ప్రయత్నం చేస్తున్నాడురా వచ్చేస్తాడు. అని ధైర్యం చెప్పారుట మా అత్తగారు. 1970లో మా పెళ్ళి జరిగింది. 2000లో మా వారికి సికింద్రాబాద్ ట్రాన్స్ఫర్ అయింది. ఆ ఆర్డరు కాయితం నా చేతికిచ్చి కాస్త అటూ ఇటూగా అయినా మాట నిలబెట్టుకునే వంశం మాది అన్నారు.

సందడి సందడిగా అలా జరిగిపోయింది జీవితం అంతా. నవ్వుతూనే బతికేశాం. అందుకే హాస్యం నా జీవితంలో ఒక భాగం అయిపోయింది. అలాగని మాకు కష్టాలు లేవా అంటే వున్నాయి. సమస్యలు రావా అంటే వస్తాయి. వాటి దోవన అవి వస్తాయి పోతాయి అంతే.

అసలామాటకొస్తే ఎవరి జీవితమూ పూలపాన్పు కాదు. అన్నీ వున్నా ఏడిచేవాళ్ళూ వున్నారు. ఏమిలేకపోయినా నవ్వుతూ జీవించేవాళ్ళూ వున్నారు. కాసేపు మనసారా నవ్వుకుని హాయిగా వుందాం అనుకునే వారు ఎందరో ఉన్నారు. నవ్వటం ఆరోగ్యం అనుకొనేవారూ వున్నారు.

వారికోసమే రాశాను. రాస్తున్నాను. ఇకముందు కూడా రాస్తాను.

ఈ కథల సంపుటికి ముందుమాట రాయమని ప్రముఖ హాస్యరచయిత శ్రీ శ్రీరమణగారిని అడిగాను. శ్రీరమణమార్కు ఒరవడితో ముందుమాట రాసి నాకు అందించారు. అది చదివాక, నాకు గుండె తారుమంది. ఒక పాత సంఘటన గుర్తుకొస్తోంది. వెనకటికి మా ఊళ్ళో ఒక ఇల్లుండేది. ఆ ఇల్లు గలవారు చాలా గొప్పవారు. వారింటి సింహద్వారం మీద నగిషీపని చూడ్డానికి రెండు కళ్ళూ చాలవు. శివ కల్యాణం, దశావతారాలు, గోవర్ధనోద్ధరణ వంటి ఘట్టాలన్నీ నయనానందకరంగా చెక్కబడి వుండేవి. అవిగాక అంచుల వెంబడి లతలు, కిందుగా ఏనుగులూ. వచ్చిన వాళ్ళు ఆ సింహద్వారం దగ్గరే ఆగిపోయేవారు.

ఆ ఇంటివారు డబ్బు మాత్రమే కాక మంచితనం మర్యాద కూడా వున్నవారు. గుమ్మందగ్గరే ఆగిపోయిన అతిథులని లోపలికి దయచేయండి అని బతిమాలి బామాలి లోపలికి తీసికెళ్ళేవారు. నిజానికి ఇంటిలోపలకూడా అంత శోభాయమానంగానూ వుండేది. పాలీషు బండలు పరిచిన నేల, ఉయ్యాల బల్ల, గోడగడియారం టేకు కర్రతో చేయబడిన కుర్చీలు, రాసుకునే బల్ల. మూలగా గంభీరంగా భోషాణం పడగ్గదిలో చక్కని పందిరిమంచం, భోజనాలగదికి వెండిపూలు వేసిన పీటలు, దేవుడి గుడిలో మూరెడేసి వెండిదీపం కుందులూ, వెండిసింహాసనం, విగ్రహాలూ, ఇల్లుదాటి బయటికెళ్తే కామధేనువుల్లాంటి గోవులూ, గోవత్సాలూ అంతా లక్ష్మీప్రసన్నంగా వుండేది. అన్నీ చూసి, బానే వున్నాయి కానీ ఆ సింహద్వారం అందముందు కాస్త వెలవెలబోతున్నాయి అనుకొని వారి ఆతిథ్యం స్వీకరించి వెళ్ళబోతూకూడా మళ్ళీ సింహద్వారం ముందు ఆగి కాసేపు వీక్షించి వెళ్ళేవారు. అలాగే పాఠకులు ఇప్పుడీ ముందుమాట దగ్గరే ఆగిపోతే!!! ఏం చేస్తాం? అన్నింటికీ ఆ భగవంతుడే వున్నాడు అని దేవుడి మీదే భారం వేస్తున్నాను. ఇంత చక్కని ముందుమాట రాసినందుకు శ్రీ రమణగారికి కృతజ్ఞతలు.

ఈ పుస్తకానికి చక్కటి ముఖచిత్రం రూపొందించిన ప్రముఖ చిత్రకారులు శ్రీ కె.వి. భీమారావుగారికి అందుకు సాయం చేసిన మా అన్నయ్య వల్లూరి వెంకట సత్యనారాయణ మూర్తికీ నా కృతజ్ఞతలు.

పుస్తకాన్ని అందంగా తీర్చిదిద్దిన పుస్తకరూపశిల్పి, శ్రీ తాళ్లపల్లి మురళీధరగౌడు గారికి, టైప్‌సెట్ చేసిన శ్రీ కొండయ్యగారికి, సకాలంలో అచ్చువేసి అందించిన కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్ అధినేత శ్రీ జగన్‌మోహన్‌రెడ్డిగారికి, ఈ కథలను ప్రచురించిన పత్రికల వారికీ నా ధన్యవాదాలు.

నా రచనలను ఆదరించి నన్నొక రచయిత్రిగా గుర్తించిన పాఠకులకు సాదర ప్రణామాలు.

*పొత్తూరి విజయలక్ష్మి*

# కథా క్రమం


1. ఆనందమే అందం ---------------------------------- 13
2. సగటు ఇల్లాలి స్వగతం -------------------------------- 25
3. ప్రత్యేక దినం ------------------------------------ 32
4. అ.భ.సం. ---------------------------------------- 40
5. కొత్తకథ ----------------------------------------- 49
6 రావోయి చందమామ... ఈ వింత గాథ వినుమా! -------------------- 63
7. మా ఆవిడకి పతి దొరికాడు ----------------------------- 75
8. తమాషా గారడీ! ---------------------------------- 83
9. అంత్యక్రియ ------------------------------------- 91
10. ఇచ్చట విడాకులు ఇవ్వబడవు --------------------------- 97
11. నలుగురితోపాటు... ------------------------------- 109
12. బంగాళాదుంపల తగాదా ---------------------------- 122
13. అవంతిక ఆవకాయ పెట్టింది --------------------------- 130
14. కథ వెనుక కథ ----------------------------------- 138
15. పెళ్ళిచూపులు ----------------------------------- 146
16. మంగళం మంగళం ---------------------------------- 159
17. అచ్చుతిప్పలు ------------------------------------ 166
18. పచ్చడన్నం -------------------------------------- 174
19. నిద్రానుభవాలు ----------------------------------- 180
20. నామకరణం --------------------------------------- 187

# ఆనందమే అందం

సాయంత్రం అయిదు గంటలయింది. ఎండ తీవ్రత ఇంకా తగ్గలేదు. వాహనాల రద్దీ పెరిగింది. రోడ్లన్నీ హడావిడిగా ఉన్నాయి. లైబ్రరీలో కూర్చుని పేపర్లన్నీ చదవడం ముగించి లేచాడు రామారావు. భార్యకోసం తీసుకున్న పుస్తకం కార్డు మీద ఎంట్రీ చేయించి ఇంటికి బయలుదేరాడు.

ఆయన కోసమే ఎదురు చూస్తోంది జానకమ్మ. ఇద్దరూ కలిసి కాఫీ తాగారు. ఆ తర్వాత కార్యక్రమం మొక్కలకి నీళ్ళు పోయడం. ఇద్దరూ సాయం పట్టి కబుర్లు చెప్పుకుంటూ నీళ్లు పోశారు. మల్లెమొక్క నిండా మల్లెమొగ్గలే. ఇంట్లోంచి పళ్ళెం తీసుకొచ్చి మొగ్గలు కోయసాగింది జానకమ్మ. అప్పుడే కాలేజీ నుంచి వచ్చిన పక్కింటమ్మాయి పలకరించే సరికి కబుర్లలో పడ్డాడు రామారావు. “ఏమిటమ్మా కాలేజీ విశేషాలు?” అని అలవాటుగా అడిగాడు. “ఏమిలేవు బాబాయిగారు” అంది సుధ. “ఏమిటమ్మా ఇది? ఏపూట కాపూట ఏదైనా తాజావార్త వినిపిస్తావేమోనని చూస్తుంటే ఏమి లేదంటున్నావ్. మండల్ కమిషన్ గొడవ అయిపోయి చాల్రోజు లైపోయిందికదా మళ్ళీ స్ట్రయికూ గట్రా చేసే ఆలోచనేం లేదా?” అన్నాడు.

“చెయ్యాలని మాకు సరదాగానే ఉందండీ. కానీ, కారణం దొరకద్దూ!”

“మీరు కావాలంటే కారణమే దొరకదా! ఏదో ఒకటి చూసుకుని త్వరగా స్ట్రయిక్ మొదలెట్టండి మరి కాలేజీలు మూసేస్తే చక్కగా మనిద్దరం చెస్ ఆడుకోవచ్చు” సరదా పడ్డాడు ఆయన.

“ఓ అలాగే మీ ఆశీర్వాదం ఉండాలే కానీ అదెంతసేపు” హామీ ఇచ్చేసి నవ్వుతూ లోపలకి వెళ్ళిపోయింది సుధ.

భార్యకి మొగ్గలు కోయడంలో సాయం చేసి, ఆవిడతో ఇంట్లోకి వెళ్ళి పక్కనే కూర్చుని లైబ్రరీలో జరిగిన వింతలూ, విశేషాలూ చెబుతూ కూర్చున్నాడు. కబుర్లు

చెప్పకుంటూ ఉండగానే విమానం వచ్చి ఆగిన శబ్దం అయింది. "అబ్బాయి వచ్చాడు" లేచి లోనికి వెళ్ళింది జానకమ్మ.

స్కూటర్ స్టాండ్ వేసి లోపలికి వచ్చాడు మనోహర్, ఏమిటి నాన్నా విశేషాలు? ఉత్తరాలేమైనా వచ్చాయా? వీడు స్కూలుకి వెళ్ళాడా? వచ్చి తండ్రి పక్కన కూర్చున్నాడు.

ఉత్తరాలు ఏమీ రాలేదురా. వీళ్లిద్దరూ మూడు గంటలకే స్కూల్‌కి వెళ్ళారు. ఇంకేం లేవు విశేషాలు. అదిసరే, ఇవాళ ఇంత ఆలస్యం అయిందేం? అన్నాడు రామారావు.

మనోహర్ మొహం చిరాగ్గా మారిపోయింది.

"ఈ కరెంటు వాళ్ళతో మా చెడ్డ చిరాగ్గా ఉంది నాన్నా. రోజూ మధ్యాహ్నం మూడయ్యేసరికి ఠంచనుగా కరెంటు పోతుంది కదా! ఇవాళ ఎంతకీ పోదే. అప్పటికీ అన్నీ సర్దేసుకుని లైట్లవంకే చూస్తూ కూర్చున్నాం. దాని మొహం మండ–పావు తక్కువ అయిదైనా ఇంకా లైట్లు వెలుగుతూనే ఉన్నాయి. అయిదింటికిదాకా అక్కడే కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నాం" విసుగ్గా చెప్పాడు మనోహర్.

అతగాడి ఆఫీసు ఒక పురాతన కట్టడంలో మధ్యలో ఉంది. గుహలోకి దూరిపోయినట్లు సందులూ గొందులూ తిరిగి లోపలికి పోవాలి. పట్టపగలు కూడా కటిక చీకటి. కన్ను పొడుచుకున్నా కనిపించదు. పూర్తిగా కరెంటు దీపాలమీదే ఆధారం. ప్రతిరోజూ మూడయ్యేసరికి కరెంటు పోతుంది. అందుకని ముందు జాగ్రత్తగా రెండు కొట్టేసరికి ఫైళ్ళు కట్టేసి రెడీ అయిపోతారు స్టాఫ్ అంతా. కరెంటు పోగానే లేచి ఓ పావుగంట అక్కడా ఇక్కడా తచ్చాడి ఇళ్ళకి వెళ్ళిపోతారు. మరి అలాంటిది కరెంటు పోకపోతే!

"నా తండ్రే! ఎంత కష్టం వచ్చింది నాయినా నీకు?" పరామర్శించాడు రామారావు.

"కష్టంలో కాస్తా అయినా, గంటల తరబడీ ఆఫీసులో కూర్చోవాలంటే విసుగెయ్యదూ! వెధవది– క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభం అయినా బాగుండును– కాస్త కాలక్షేపం" కాఫీ అందుకుంటూ మొరపెట్టుకున్నాడు.

కొడుక్కి కాఫీ ఇచ్చి మళ్ళీ పూలు కట్టడానికి కూర్చుంది జానకమ్మ.

"పేపర్లు చూశారా నాన్నా. ఏదైనా కనిపించిందా?" అడిగాడు మనోహర్. అతని తమ్ముడు దినకర్ డిగ్రీ పూర్తిచేసి ఓ ప్రయివేటు కంపెనీలో పనిచేసేవాడు. అది కాస్తా అంతక్రితం రోజే ఊడిపోయింది. ప్రస్తుతం ఖాళీగానే ఉన్నాడు. అతని

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=1529**

* * *

**Read other books of Pothri Vijayalakshmi @**

http://kinige.com/kbrowse.php?via=author
&name=Pothuri+Vijayalakshmi&id=546